ఆర్టీసీ కార్మికుల రణభేరి!

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- 40 అంశాలపై నేడు ప్రభుత్వానికి మెమోరాండం
- సర్కార్ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ: జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికులు రణభేరి మోగించారు. యాజమాన్య నిర్లక్ష్య ధోరణిపై ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై 40 అంశాలను ప్రభుత్వం ముందుంచాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నిర్ణయించింది. సర్కారు నిర్ణయం మేరకు కార్యాచరణ ఉంటుందని జేఏసీ నేతలు ప్రకటించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని రగలిపోతున్న కార్మికులు పోరుబాటకే సిద్ధమయ్యారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుంచి డ్రైవర్లు, కండక్టర్లపై పనిభారం పెరిగిందని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బాండ్ల బకాయిలు రూ.200 కోట్లు, 2 పీఆర్సీ బకాయిలు, డీఏలు ఇప్పటివరకు పరిష్కారం కాకపోవడం కార్మికుల్లో అసహనం పెరిగిందని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించి, కార్మిక సంఘాలకు గుర్తింపు ఇస్తామనే మాటను పట్టించుకోకపోవడంపై ఆర్టీసీ జేఏసీ మండిపడుతున్నది. ఈ నేపథ్యంలో శనివారం ఆర్టీసీ జేఏసీ తరఫున 40 అంశాలతో కూడిన మెమోరాండాన్ని రవాణా మంత్రి, ఎండీ, రవాణాశాఖ కమిషనర్‌ను కలిసి వారి ముందు పెట్టనున్నట్టు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. కార్మికుల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటించనున్నట్టు వెల్లడించారు.

ఎన్నికలు నిర్వహించాలి: థామస్‌రెడ్డి, వెంకన్న

కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు థామస్‌రెడ్డి, వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని వారు తేల్చి చెప్పారు. ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటలు మాత్రమే డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 11 గంటలు, డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు.

ఇండ్ల వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

- 300 కోట్ల ఆదాయమే లక్ష్యం
- మరింతగా లాజిస్టిక్ నెట్‌వర్క్ విస్తరణ
- హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తరించేందుకు యాజమాన్యం ఏర్పాటు చేస్తున్నది. వినియోగదారుల ఇండ్ల వద్దే 'పికప్ టు డెలివరీ'కి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. ఈ సేవలను మరింత విస్తరించి ఏటా అదనంగా రూ.300కోట్ల ఆదాయం సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రస్తుతం అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో కార్గో బుకింగ్ కోసం ఆర్టీసీలో ప్రత్యేక వ్యవస్థ ఉన్నది. పెద్ద మొత్తంలో బుకింగ్ ఉన్నప్పుడు వారి నుంచి నేరుగా సరుకులు తీసుకొని రవాణా చేస్తున్నది. డెలివరీ మాత్రం హైదరాబాద్‌లాంటి మహా నగరంలో జేబీఎస్, సీబీఎస్, ఉప్పల్ ప్రాంతాల్లో మాత్రమే ఉన్నది. మిగతా పట్టణాల్లో కేవలం బస్టాండ్లలో మాత్రమే డెలివరీ తీసుకోవాలి. దీని వల్ల చాలామంది కస్టమర్లు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై దృష్టిసారించిన ఆర్టీసీ వినియోగదారుల చెంతకే వస్తువులను డెలివరీ చేయాలని ప్రణాళికలు వేసింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటి నుంచే పికప్ చేసుకోవాలని ఆలోచిస్తున్నది. మొదట హైదరాబాద్‌లో వెయ్యిచోట్ల ఈ సేవలను ప్రారంభించి, వాటి ఫలితాల ఆధారంగా ఇతర ప్రాంతాల్లో ప్రారంభించాలనే యోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గాడిలో పెట్టాలంటే ప్రత్యామ్నాయ ఆదాయమే మార్గమని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో రూపొందించిన ఈ కార్గో సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి.

ఆత్మహత్యల్లో 60% యువతే

- డ్రగ్స్‌తో దారితప్పుతున్న 18-35 ఏండ్ల వయస్కులు
- తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యయనం
- కౌన్సెలింగ్ లేకపోవడంతోనే ప్రమాదకర ఆలోచనలు
- ప్రతి పాఠశాలలో సైకాలజిస్టులను నియమించాలని సూచనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో జరుగుతున్న ఆత్మహత్యల్లో 60 శాతంపైగా యువత ఉండటం ఆందోళనకర విషయమని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ వెల్లడించింది. ఇందులో చాలావరకు మాదకద్రవ్యాల బారినపడి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నది. ఈ మేరకు అసోసియేషన్ బృందం 18-35 మధ్య వ్యక్తుల మానసిక పరిస్థితిపై అధ్యయనం చేసినట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. మాదకద్రవ్యాలకు ఆకర్షితులైన వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని వెల్లడించారు. డ్రగ్స్‌కు ముందు, తీసుకున్న తర్వాత వారి శరీరంలో వచ్చిన మార్పులను విశ్లేషించినట్టు వివరించారు. బాధితుల కుటుంబసభ్యుల నుంచి వివరాలు, సైకియాట్రిస్టుల అభిప్రాయాలను సేకరించామని చెప్పారు. డ్రగ్స్ తీసుకొనేవారి కేంద్ర నాడీవ్యవస్థ సరిగా పనిచేయక వారేం చేస్తున్నారో కూడా తెలియని సైకో ప్రపంచంలోకి వెళ్తారని తెలిపారు. డ్రగ్స్ అలవాటు ఉన్నవారిని వెంటనే గుర్తించి సరైన సమయంలో కౌన్సెలింగ్, చికిత్స అందిస్తే మామూలు మనుషులుగా మార్చే అవకాశం ఉన్నదని తెలంగాణ కౌన్సెలింగ్ అసోసియేషన్ పేర్కొన్నది.

ప్రతి పాఠశాలలో సైకాలజిస్టుల సేవలు అవసరం

డ్రగ్స్ భూతం దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నది. తెలంగాణలో ఈ ఏడాది 938 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద 78,331 కేసులు నమోదయ్యాయి. డ్రగ్స్ బాధితులకు కౌన్సెలింగ్ సేవలందించటం ముఖ్యం. ప్రతి పాఠశాలల్లో సైకాలజిస్టులను నియమిస్తే విద్యార్థులు చెడుదారుల్లో నడవకుండా సన్మార్గంలో నడిచేలా ప్రేరణ కల్పిస్తారు. డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మేమూ సిద్ధం. 9533660938 నంబర్‌ను సంప్రదిస్తే కౌన్సెలింగ్ ఇస్తాం.

- డాక్టర్ మోత్కూరి రామచంద్రం, ప్రెసిడెంట్, తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్

లక్షణాలు:

కండ్లు ఎర్రగా మారటం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, నిద్రలేకుండా ఉండటం, చేతులు, కాళ్లలో వణుకు, చెమటలు పట్టడం, పల్స్‌రేట్ పెరగటం, శరీరం పట్ల శ్రద్ధ లేకపోవటం, తరుచూ పనులు వాయిదా వేయటం తదితర లక్షణాలు డ్రగ్స్ అలవాటు పడినవారిలో కనిపిస్తాయని సైకియాట్రిస్టులు చెప్పారు. తల్లిదండ్రులు వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. యాంటి క్రేవింగ్ ట్రీట్‌మెంట్ ఇప్పించడం అతి ముఖ్యమని తెలిపారు.

వైద్యసిబ్బందికి భద్రత పెంచండి

మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో సేవలందిస్తున్న డాక్టర్లు, నర్సులు, వైద్యసిబ్బందికి భద్రత కల్పించాలని సంబంధిత ఉన్నతాధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఆదేశించారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా డాక్టర్లు, నర్సులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. నిందితుడిపై కఠినచర్యలు తీసుకోవాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి కఠిన శిక్షపడేలా చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో భద్రత అంశాలను పొందుపరిచిందని చెప్పారు.

ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాద్రి ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

భద్రాద్రి ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు

- అడ్డుకున్న ఆలయ ఈవో, సిబ్బందిపై కర్రలతో దాడి
- ఈ భూములన్నీ ఏపీ పరిధిలోనే..
- అక్కడి అధికారులు చెప్పినా ఖాతరుచేయని ఆక్రమణదారులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 16: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన ఆలయ భూముల్లో ఆక్రమణలు ఆగడం లేదు. సరిహద్దున ఆంధ్రాలోని పురుషోత్తపట్నంలో ఉన్న ఆలయ భూముల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఆలయ ఈవో, అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. వీరిపై ఆక్రమణదారులు కర్రలతో దాడులు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రామాలయ భూములకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ అక్రమ కట్టడాలను మాత్రం ఆక్రమణదారులు ఆపడంలేదు. 1970 నుంచి 2022 వరకు ఏపీ హైకోర్టుతోపాటు స్థానిక, జిల్లా, ఎండోమెంట్ ట్రైబల్ సెటిల్‌మెంట్ కోర్టులు, తెలంగాణ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగానే ఉత్తర్వులు ఇచ్చాయని ఆలయ ఈవో తెలిపారు. అయినప్పటికీ ఈ ఆక్రమణలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. గతంలో 250 వరకు, తాజాగా 46 వరకు కేసులు ఆక్రమణదారులపై ఉన్నాయి. కానీ అవేవీ పరిష్కారం కాలేదు. అక్రమ కట్టడాల వల్ల దేవస్థానానికి వచ్చే కూరగాయలు, ఇతరత్రా ఆదాయం కోల్పోవాల్సి వస్తున్నదని ఈవో పేర్కొన్నారు. సదరు భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని రెండు నెలల క్రితమే ఏపీ రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు సూచించారు. అయినప్పటికీ 50 శాతం నిర్మాణాలు పూర్తిచేశారు. తహసీల్దార్ ఆదేశాలను సైతం ఆక్రమణదారులు ఖాతరు చేయడం లేదు. దీంతో ఇటు భద్రాద్రి ఆలయ బాధ్యులు, అటు ఏపీ అధికారులు మండిపడుతున్నారు.

నేడు డాక్టర్ల 'స్టెత్ డౌన్'

- కోల్‌కతా ఘటనకు నిరసనగా నర్సులు సహా సమ్మె
- ఒక్కరోజు విధుల బహిష్కరణకు ఐఎంఏ పిలుపు
- ఇందిరాపార్క్ వద్ద అన్నిసంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- గంటసేపు ఓపీ సేవలకు టీజీజీడీఏ, నర్సులు దూరం
- ఓపీని నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన ప్రైవేట్ దవాఖానలు

నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు వైద్యసేవలను నిలిపివేసి 'స్టెత్ డౌన్' నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద అన్ని వైద్యసంఘాలు కలిసి ధర్నా చేయాలని నిర్ణయించాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఒకరోజు ఓపీ సేవలు నిలిపివేయాలని ఐఎంఏ పిలుపునిచ్చింది. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 వరకు ఓపీకి దూరంగా ఉండాలని కోరింది. ఈ మేరకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఐఎంఏ పిలుపు మేరకు అనేక ప్రైవేట్ దవాఖానలు శనివారం ఓపీని నిలిపివేస్తున్నట్టు ప్రకటించాయి. ఐఎంఏ, జూనియర్ డాక్టర్ల సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) తెలిపింది. ప్రభుత్వ వైద్యులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని విజ్ఞప్తిచేసింది. ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేద రోగులకు ఇబ్బందులు కలగకుండా ఉదయం 9 నుంచి 10 వరకు గంటపాటు ఓపీ సేవలు నిలిపివేయాలని పిలుపునిచ్చింది. జూనియర్ డాక్టర్లు సమ్మెలో ఉన్న కారణంగా అవసరమైతే గంట ఎక్కువగా పనిచేసి ఓపీ సేవలకు ఆటంకం కలుగకుండా చూడాలని కోరింది. కోల్‌కతా ఘటన వెనుక ఉన్న కుట్రకోణాన్ని వెలికితీసి, దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీపీహెచ్‌డీఏ) డిమాండ్ చేసింది. శనివారం వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా వైద్యులు, వైద్యసిబ్బందికి పటిష్ఠమైన భద్రత కల్పించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు శనివారం జరిగే ధర్నాలో పాల్గొననున్నట్టు వెల్లడించింది. ధర్నాలో పాల్గొంటామని తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఒకరోజు సమ్మెకు మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ తెలిపింది. సీపీఐ కూడా మద్దతు పలికింది.

నర్సులపై దాడులకు నిరసన

కోల్‌కతాలో ఘటనతోపాటు రాష్ట్రంలోని షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై దాడి, ఉత్తరాఖండ్‌లో ఓ నర్సుపై హత్యాచార ఘటనపై తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ (టీఎన్ఏ) తీవ్రంగా స్పందించింది. శనివారం ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని కోరింది. పేద రోగులకు ఇబ్బందులు కలగకుండా 9 నుంచి గంటసేపు నిరసన ప్రదర్శన చేయాలని తెలిపింది.

ఢిల్లీలో ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

త్వరలో హైదరాబాద్‌ను సందర్శిస్తా

సీఎంకు ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ హామీ

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): త్వరలోనే హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ పరికరాల దిగ్గజం ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ హామీ ఇచ్చారు. శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేందుకు ఫ్యూచర్ సిటీ పేరిట ఫోర్త్ సిటీకి రూపకల్పన చేస్తున్నామని సీఎం వివరించారు. విద్య, వైద్యం, క్రీడలు, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి బహుముఖ అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఫోర్త్‌సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థ పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అనుమతులతో పాటు అవసరమైన మద్దతు అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యాంగ్ లియూ మాట్లాడుతూ.. ఫోర్త్‌సిటీ ప్రతిపాదన బాగున్నదని, త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తానని చెప్పారు. ముందుగా చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, భారతదేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయేశ్‌రంజన్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీ2పీ లెండింగ్ కఠినం

- నిబంధనల్ని సవరించిన ఆర్బీఐ

ముంబై, ఆగస్టు 16: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ-పీర్ టు పీర్ లెండింగ్ ప్లాట్‌ఫామ్స్ (ఎన్‌బీఎఫ్‌సీ-పీ2పీ రుణ వేదికలు)ల్లో పారదర్శకతను పెంచడం కోసం ఆర్బీఐ శుక్రవారం నిబంధనల్ని కఠినతరం చేసింది. సవరించిన మాస్టర్ డైరెక్షన్ ప్రకారం పీర్ టు పీర్ లెండింగ్‌ను టెన్యూర్ లింక్డ్ అష్యూర్డ్ మినిమం రిటర్న్స్, లిక్విడిటీ ఆప్షన్స్ వంటి ఫీచర్లతో ఓ పెట్టుబడి ప్రొడక్ట్‌గా పీ2పీ ప్లాట్‌ఫామ్స్ చూపకూడదు. అలాగే రుణ పెంపు, రుణ భరోసాలకు వీలున్న ఏదైనా ఇన్సూరెన్స్ ప్రొడక్ట్ క్రాస్-సెల్లింగ్‌కూ వీల్లేదు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలనూ మంజూరు చేయకూడదు. ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. కొన్ని సంస్థలు నిబంధనలను ఉల్లంఘిస్తున్న నేపథ్యంలోనే ఈ సవరణలు చేసింది.

అరబిందో ఫార్మాకు యూఎస్ఎఫ్‌డీఏ షాక్

హైదరాబాద్, ఆగస్టు 16: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మాకు అమెరికా నియంత్రణ మండలి షాకిచ్చింది. అరబిందోకు చెందిన సబ్సిడరీ సంస్థయైన యుగియా ఫార్మా స్పెషలిస్ట్ లిమిటెడ్‌కు రాష్ట్రంలోవున్న యూనిట్‌కు అధికారిక చర్యను కొనసాగిస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి హెచ్చరిక లేఖ జారీ చేసినట్లు అరబిందో ఫార్మా బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ హెచ్చరిక లేఖ ఎందుకు జారీ చేసింది మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ లేఖతో అమెరికా మార్కెట్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదని పేర్కొంది. హైదరాబాద్‌కు సమీపంలోని పాశమైలారం వద్ద ఉన్న యూనిట్‌ను జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు యూఎస్ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు తనిఖీ చేశారు.

భద్రతా దళాలకు ఎల్ఐసీ హౌజింగ్ ఆఫర్

ముంబై, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశీయ భద్రత దళాలకు ఎల్ఐసీ హౌజింగ్.. గృహ రక్షక్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.2 కోట్ల లోపు గృహ రుణం తీసుకునేవారికి 8.40 శాతం వడ్డీకే రుణాలు అందిస్తున్నది. సిబిల్ స్కోర్ 750కి పైగా ఉన్నవారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా ఎత్తివేసిన బ్యాంక్..ఈ ప్రత్యేక స్కీం సెప్టెంబర్ చివరి వరకు అందుబాటులో ఉండనున్నదని పేర్కొంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కోస్ట్ గార్డ్ విభాగాల్లో పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన భద్రత దళాలు అర్హులని తెలిపింది.

వాణిజ్య

జోరుగా వడ్డింపులు

రుణాలపై పెరుగుతూపోతున్న వడ్డీరేట్లు

ఈ నెలలో ఎంసీఎల్ఆర్‌ను సవరించిన 8 బ్యాంకులు

గృహ, ఆటో, వ్యక్తిగతసహా అన్ని లోన్లు ప్రియం

రుణగ్రహీతలకు భారంగా మారుతున్న ఈఎంఐలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: బ్యాంకులు వరుసపెట్టి వడ్డీరేట్లను పెంచేస్తున్నాయి. ఈ నెల మొదలు ఇప్పటిదాకా ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన 8 బ్యాంకులు తమ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల మేర పెంచేశాయి. వీటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), కెనరా, యూకో, ఐడీబీఐ, యెస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లున్నాయి. ఓవర్‌నైట్, నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక కాలపరిమితి ఎంసీఎల్ఆర్‌లను ఇవి సవరించాయి. కొన్నైతే రెండేండ్లు, మూడేండ్ల ఎంసీఎల్ఆర్‌లనూ పెంచాయి. ఇలా వడ్డీరేట్లను పెంచడం ఎస్బీఐకి వరుసగా ఇది మూడో నెల కావడం గమనార్హం. కాగా, గృహ, వాహన, వ్యక్తిగత తదితర అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్ల నిర్ణయానికి ఎంసీఎల్ఆరే బ్యాంకులకు ప్రామాణికం. దీన్ని పెంచిన ప్రతిసారీ రుణగ్రహీతలు తమ నెలవారీ కిస్తీ (ఈఎంఐ)లను ఇంకా ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. లేదంటే రుణ కాలపరిమితైనా (టెన్యూర్) పెరుగుతున్నది. నిజానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను ఏడాదిన్నరగా యథాతథం గానే ఉంచుతున్నది. ప్రస్తుతం రెపో రేటు 6.50 శాతం వద్ద ఉన్నది. ద్రవ్యోల్బణం అదుపు సాకుతో వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ద్వైమాసిక ద్రవ్య సమీక్షల్ని సెంట్రల్ బ్యాంక్ ముగించేస్తున్నది. అయినప్పటికీ బ్యాంకులు మాత్రం రుణాలపై వడ్డీరేట్లను పెంచుతూనే ఉన్నాయి. దీంతో అటు వ్యాపార, పారిశ్రామిక రంగాలపై.. ఇటు రుణగ్రహీతలపై మోయలేనంత భారం పడుతున్నది. ప్రధానంగా రుణ లభ్యత ఖరీదై ఆటో, నిర్మాణ, దాని అనుబంధ రంగాలు దెబ్బ తింటున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నెల 1 నుంచీ..

ఈ నెల 1న పీఎన్‌బీ, యెస్ బ్యాంక్‌లు తమ ఎంసీఎల్ఆర్‌లను పెంచాయి. అన్ని కాలపరిమితులపై 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్టు పీఎన్‌బీ ప్రకటించింది. ఇందులో కనిష్టం 8.30 శాతం, గరిష్టం 9.20 శాతంగా ఉన్నది. మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయా బ్యాంకులు పేర్కొన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ ఆగస్టు 8న కొత్త ఎంసీఎల్ఆర్‌లను అమల్లోకి తెచ్చింది. 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ఈ బ్యాంక్‌లో కనిష్ట ఎంసీఎల్ఆర్ 9.10 శాతం, గరిష్టం 9.45 శాతం. అలాగే ఈనెల 10న యూకో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ పెరిగింది. ఆయా టెన్యూర్స్‌పై 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.20 శాతంగా, ఏడాదిది 8.95 శాతంగా ఉన్నది. బీవోబీ, కెనరా బ్యాంక్‌లు సైతం అన్ని టెన్యూర్స్ ఎంసీఎల్ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లదాకా పెంచాయి. ఆగస్టు 12 నుంచే కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. బీవోబీ ఎంసీఎల్ఆర్ కనిష్టం 8.15 శాతంగా ఉన్నది. కెనరా బ్యాంక్‌లో కనిష్టం 8.25 శాతం, గరిష్టం 9.40 శాతం. ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ కూడా ఈ నెల 12 నుంచే పెరిగింది. కనిష్టం 8.40 శాతంగా, గరిష్టం 10.10 శాతంగా ఉన్నది. ఇక ఈ నెల 15న దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఓవర్‌నైట్ నుంచి మూడేండ్లదాకా ఉన్న అన్ని కాలపరిమితులకూ ఈ పెంపు వర్తించింది. కనిష్ట ఎంసీఎల్ఆర్ 8.20 శాతంగా ఉంటే, గరిష్టం 9.10 శాతంగా ఉన్నది.

ఈ నెల మొదలు ఆయా బ్యాంకుల్లో మారిన ఎంసీఎల్ఆర్ (శాతాల్లో)

కాలపరిమితి	ఎస్బీఐ	బీవోబీ	హెచ్‌డీఎఫ్‌సీ	యెస్	కెనరా	పీఎన్‌బీ	యూకో	ఐడీబీఐ
ఓవర్‌నైట్	8.20	8.15	9.10	9.10	8.25	8.30	8.20	8.40
నెల	8.45	8.35	9.15	9.45	8.35	8.35	8.35	8.55
3 నెలలు	8.50	8.50	9.25	10.10	8.45	8.55	8.50	8.85
6 నెలలు	8.85	8.75	9.40	10.35	8.80	8.75	8.80	9.10
ఏడాది	8.95	8.95	9.45	10.50	9.00	8.90	8.95	9.15
రెండేండ్లు	9.05	—-	9.45	—-	9.30	—-	—-	9.70
మూడేండ్లు	9.10	—-	9.45	—-	9.40	9.20	—-	10.10

ద్రవ్యోల్బణం తగ్గితే..

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇటీవలి గణాంకాల్లో జూలై నెలకుగాను టోకు, చిల్లర ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు, సెప్టెంబర్‌లోనూ ఇదే ట్రెండ్ కొనసాగితే అక్టోబర్ ద్రవ్య సమీక్షలో వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ తగ్గిస్తుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటిదాకా వ్యాపార, పారిశ్రామిక రంగాల నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా ద్రవ్యోల్బణం కట్టడికే కట్టుబడి ఉన్న ఆర్బీఐ.. నిరుడు ఏప్రిల్